ప్రజాశక్తి
శుక్రవారం 17 మార్చి 2023
I
అల్లూరి సీతారామరాజు

అక్రమ కట్టడం పనుల అడ్డగింత

ప్రజాశక్తి అనంతగిరి: మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం సమీపం పెద్దరు గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఆనుకొని ప్రభుత్వ భూమిలో బినామి పేరుతో గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడం పనులను స్థానిక రెవిన్యూ అధికారులు గురువారం నిలిపివేశారు. అక్రమ కట్టడాల పనులను గుర్తించిన వీఆర్వో రాజేశ్వరి సిబ్బందితో వెళ్లి గిరిజనుడైన బాకా. వెంకటరావు కు చెప్పారు. వెంకటరావు వద్ద నుండి గిరిజన నేతరుడు క్రయ విక్రయాలు జరిపినట్లు ఫిర్యాదులు అందాయని అందుకే పనులను పరిశీలించామన్నారు. తక్షణమే పనులు నిలుపుదల చేయకుంపేట చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ లింగమూర్తి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

సాగునీటికి నిధుల కోత

- సుజల స్రవంతికి బడ్జెట్‌లో దక్కని ప్రాధాన్యత
- రూ. 141.79 కోట్లకు తగ్గింపు
- పెద్దేరు, రైవాడకు మొండిచేయి
- కోణాంకు రూ.5.38 లక్షలే కేటాయింపు
- ఊసేలేని సుగర్ ఫ్యాక్టరీల ఆధునికీకరణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు మళ్లీ ప్రభుత్వం మొండిచేయిచూపింది. సాగునీటి వనరుల అభివృద్ధికి బడ్జెట్లో తగిన కేటాయింపులు లేవు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిజేసింది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల వృద్ధికి కనీస ప్రాధాన్యత ఇవ్వలేదు. బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులకు నిధులు పెంచకపోగా 2023-24 బడ్జెట్లో కోత పెట్టింది. పెద్దేరు ప్రాజెక్టుకు రెండేళ్లుగా బడ్జెట్ కేటాయించలేదు. ఈ ఏడాది పెద్దేరు సహా రైవాడకు మొండిచేయి చూపింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి 2022-23 బడ్జెట్లో రూ.297.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.141.79 కోట్లకు తగ్గించింది. జిల్లాలో రూ.2022 కోట్లతో తొలిదశ పనులు పూర్తిచేసి 1.30 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలన్న ప్రాథమిక లక్ష్యానికి తూట్లు పొడిచేలా ప్రభుత్వ కేటాయింపులున్నాయి. సుజల స్రవంతి పూర్తయితే జిల్లాలో 3.25 లక్షల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు లభించనుంది. కనీసం తొలిదశ పనులు పూర్తి చేసినా 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఆశపడ్డారు. ప్రభుత్వ కేటాయింపులు భూ సేకరణ చెల్లింపుల్లో ఏ మూలకూ సరిపోవు. 2021-22లో కేవలం రూ.79.95 కోట్లు కేటాయించి, రూ.2.61 కోట్లు విడుదల చేయడంతో పనులు జరగలేదు. నిధుల విడుదల్లో అదే పరిస్థితి కొనసాగడంతో సుజల స్రవంతి పనుల్లో ఆశించిన పురోగతి కన్పించడంలేదు.

తాండవకు 2021-22లో కోటి రూపాయలు కేటాయించిన ప్రభుత్వం, 2022-23లో రూ.88.93 లక్షలకు కుదించి, 2023-24 బడ్జెట్లో రూ.2.54 కోట్లకు పెంచింది. తాండవకు ఐదు కోట్లు అవసరమని నీటిపారుదల శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ బడ్జెట్లో రూ.2.54 కోట్లు కేటాయించింది. దాదాపు ఏ ప్రాజెక్టుకూ ప్రతిపాదనలకు తగినట్లు కేటాయింపులు చేయలేదు. కోణాంకు 2021-22లో పది లక్షలు కేటాయించిన ప్రభుత్వం, 2022-23లో రూ.40.10 లక్షలకు పెంచింది. ఈ ఏడాది రూ.5.38 లక్షలకే పరిమితం చేసింది. రైవాడకు 2021-22లో 11.46 లక్షలు, 2022-23లో రూ.2.26 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది పైసా కూడా లేదు. పెద్దేరుకు 2021-22లో రూ.10.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 2022-23, 2023-24లో కేటాయించడం మానేసింది. గతేడాది పెద్దేరు జలాశయ కాలువ ఆధునికీకరణ పనులు, పూడికతీత, కొద్దిపాటి భూ సేకరణ చెల్లింపులకు రూ.9 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపినా స్పందించలేదు.

జిల్లాలోని క్రషింగ్ నిలిపివేసిన తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునికీకరించి తెరిపించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదు.

ప్రాజెక్టు	కేటాయింపులు (కోట్లలో) 2022-23	2023-24
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి	297.50	141.79
తాండవ	88.93 లక్షలు	2.54 కోట్లు
రైవాడ	2.26 కోట్లు	-
కోణాం	40.10 లక్షలు	5.38 లక్షలు
పెద్దేరు	-	-

గిరిజన వ్యతిరేక బడ్జెట్

గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ గిరిజన వ్యతిరేకం బడ్జెట్ అని, జగన్ సర్కార్ గిరిజన ఉపప్రణాళికను విస్మరించిందని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పల నరస విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బడ్జెట్లో ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం మొత్తం బడ్జెట్లో ఆరు శాతం నిధులు కేటాయించాలన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్‌కు 6,929 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టారన్నారు. మొత్తం బడ్జెట్ లో ఇది 2.48 శాతం మాత్రమేనని గిరిజనులకు 6శాతం వాటాలో 16,740 కోట్లు ఎస్టీ సబ్ ప్లాన్ కు కేటాయించాల్సి ఉందన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిబంధనలను తుంగలో తొక్కి రాజ్యాంగ విలువలను ధిక్కరించారని విమర్శించారు. 2019 నుండి 2022 ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను నవరత్నాల పేరుతో దారి మళ్లించారన్నారు. వీటిలో కూడా కేటాయించిన నిధులను కేవలం 70 శాతం మాత్రమే ఖర్చు చేసి, మిగిలింది రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో జమ చేసుకుందన్నారు. సుమారు 18 రకాల పథకాలను రద్దు చేశారని విమర్శించారు. ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం రాష్ట్ర బడ్జెట్ సవరించి ఆరు శాతం నిధులు కేటాయించాలని, పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పునరావాసం, నష్టపరిహారం, మౌలిక వసతులు వంటి సమస్యలను గాలికి వదిలేశారన్నారు. ఇప్పటికే మారుమూల ప్రాంతంలో రహదారులు లేక డోలిమోతలతో మాతా శిశు మరణాలు రోజురోజుకు పెరుగుతున్నా కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న గిరిజన చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లు కూడా రద్దు చేసిందన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో మసి పూసి మారెడు కాయ చేయడానికి జగన్ సర్కారు పూనుకుందన్నారు.

మండలి ఓట్ల లెక్కింపులో ఉత్కంఠ

-తొలి రౌండ్ పూర్తయ్యేసరికి టిడిపి, వైసిపి హోరాహోరీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ఎంవిపి.కాలనీ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. గురువారం విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. ప్రారంభ కౌంటింగ్ సాయంత్రం 6 గంటల వరకూ జరిగింది. ఓట్లన్నిటినీ కట్టలు కట్టి వేసే ప్రక్రియ సుమారు సాయంత్రం వరకూ సాగింది. మొదటి రౌండ్ ఫలితం వెల్లడయ్యేసరికి టిడిపి 4048 ఓట్ల మేర వైసిపిపై ఆధిక్యతను కనబర్చింది. పిడిఎఫ్ మూడో స్థానంలో ఉంది. మొత్తంగా 28 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఒక రౌండ్‌లో 28 వేల ఓట్లను లెక్కిస్తారు. మొత్తంగా 2 లక్షల పైచిలుకు ఓట్లు పోలైన పంగతి తెలిసిందే. గురువారం రాత్రి 9 గంటల వరకూ తొలి రౌండ్ ఫలితాన్ని సైతం అధికారులు వెల్లడించలేదు. రెండో రౌండ్ 9 గంటలకు ప్రారంభం అయ్యింది. రాత్రి 11 గంటలు దాటే సరికి 2 రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. 3 రౌండ్ల లెక్కింపు పూర్తయ్యే సరికి రాత్రి ఒంటి గంట దాటే అవకాశం ఉంది. ప్రతి రౌండ్‌కూ 2 గంటలకు పైనే సమయం పడుతోంది.

రాత్రి 11 గంటల సమయానికి వెలువడిన సమాచారం మేరకు..

టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు 11828 ఓట్లతో ప్రథమ స్థానంలో నిలవగా వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ 7,780 ఓట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 4898 ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. మొదట రౌండ్ ఓట్ల లెక్కింపు శ్రీకాకుళం జిల్లాకు సంబంధించినదని, అక్కడ టిడిపికి కాస్త మెజారిటీ ఉంటుందని తొలినుంచీ భావిస్తున్న విషయం చర్చనీయాంశమైంది. అనకాపల్లి ప్రాంతంలో కూడా టిడిపికి ఓట్లు అధికంగా వచ్చే వీలుందన్నది తెలుస్తోంది. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఒకటో రౌండ్ ఓట్ల లెక్కింపు అనంతరం మీడియాతో మాట్లాడుతూ చివరకు విజయం తనదే.. అంటూ ధీమా వ్యక్తం చేశారు. ఇంకా 1.70 లక్షల ఓట్లకు పైగా లెక్కించాల్సి ఉందన్నారు.

అధికారుల ఆకస్మిక ప్రకటనల గందరగోళం

మొదట రౌండ్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వర్ణభారతి ఆడిటోరియంలో ఒక ప్రకటన చేస్తూ.. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థికి ఎదురుగా టిక్ మార్క్ పెట్టినా ఒకటి అని సూచించినా చెల్లుతుందని

ప్రకటించారు. తొలుత ఈ అంశంపై క్లారిటీ ఇవ్వకుండా ఒక రౌండ్ పూర్తయ్యేసరికి ప్రకటించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

మీడియాపై ఆంక్షలు

కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) స్పష్టంగా మీడియా ప్రతినిధులకు పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు నేరుగా వెళ్లేందుకు పాస్‌లను మంజూరు చేసినా కౌంటింగ్ జరిగే స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోకి మీడియా వారిని అధికారులు అనుమతించలేదు. గతంలో మూడు దఫాలుగా మీడియా ప్రతినిధులను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించారు. 2023లో మీడియాపై ఆంక్షలు విధించడం, లోపలకి వెళ్లాలని ప్రయత్నించే వారితో పోలీసులకు ఘర్షణలకు దిగడం జరిగింది. స్వర్ణబారతి స్టేడియం మొదటి గేటు వరకే గురువారం మీడియాను అనుమతించారు. దీంతో సమాచారం కోసం మీడియా నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

బోయ, బెంతులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

కేంద్ర మంత్రికి ఎంపి మాధవి వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బోయవాల్మీకి, బెంతు ఒరియా జాతులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని అరకు ఎంపి గొడ్డేటి మాధవి, ఆదివాసి జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర తదితరులు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండను కోరారు. గురువారం ఢిల్లీలో ఆయనను కలిసి బోయ, బెంతులను ఎస్‌టి జాబితాలో చేర్చితే అసలైన గిరిజనులకు కలిగే నష్టాలను వివరిస్తూ వినతిపత్రం అందించారు. ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చడంతో ఆదివాసీలకు తీరని నష్టం జరుగుతుందని తెలిపారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని 100శాతం ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే చెందేలా చట్టం చేయాలని కోరారు. అధికారులు ఆదివాసి చట్టాలను సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు. గిరిజనుల హక్కులు, చట్టాలు అమలులో అధికారుల నిర్లక్ష్యంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. రెవిన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంతో గిరిజన ప్రాంతంలో అక్రమ కట్టడాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు బలరాం, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందిస్తున్న ఎంపి మాధవి, జెఏసి నాయకులు

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి సతీస్‌కుమార్

లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యుడు

ప్రజాశక్తి-చింతూరు

చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమార్ జిల్లా గాదిరాజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరోకి గ్రామపంచాయతీలోని గాదెమ్ గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ సభ్యుడు మడకం భామన్ (22) గురువారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఎదుట లొంగిపోయారు. చింతూరులో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌పి సతీష్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. భామన్ 2015 నుండి మావోయిస్టు పార్టీలో అనేక పదవుల్లో పనిచేసినట్లు తెలిపారు. 2018 మే నెలలో సోలార్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దెడు గ్రామ వద్ద జరిగిన బ్లాస్టింగ్‌లో ఏడుగురు చనిపోవటానికి కారణమయ్యాడని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు తెలుసుకొని, మావోయిస్టు పార్టీలో జరుగుతున్న వివక్షతకు వేసారి తన ముందు లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు కల్పించే సౌకర్యాలను అన్నిటిని సకాలంలో కల్పిస్తామని, మావోయిస్టులు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఓఎస్‌డి కృష్ణ కాంత్, చింతూరు అడిషనల్ ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ 42బి యన్ , చింతూరు, ఎటపాక సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

30 ఎకరాల జీడిమామిడి తోటలు దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలో జీడిమామిడి తోటల దగ్ధం కొనసాగుతోంది. ఇటీవల మర్రివాడ పంచాయితీ పిడతమామిడి, నల్లగొండ పంచాయితీ వైఎన్పాకలు, మూలపేట పంచాయితీల్లో పలువురు రైతులకు చెందిన జీడిమామిడితోటలు దగ్ధం కాగా, తాజాగా మండలంలోని బూదరాళ్ల పంచాయితీ చౌడుపల్లి గ్రామానికి చెందిన రైతులు సాగిన రాజారావు, సాగిన రామన్నపడాల్, పి. చిట్టిబాబు తదితర రైతులకు చెందిన సుమారు 30 ఎకరాల్లోని జీడిమామిడి తోటలు కాలిపోయాయి. పంట చేతికొచ్చే సమయంలో జీడిమామిడి తోటలు అగ్ని ప్రమాదానికి గురి కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం నుండి తమకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

మంటలు వ్యాపించి కాలిపోయిన జీడిమామిడి తోట

మన్యంలో భారీ వడగళ్ల వర్షం

- గాలికి నేలకొరిగిన చెట్లు
- గోడ కూలి ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. చింతూరులో వడగళ్లతో కూడిన భారీ వర్షం పడింది. వర్షం సందర్భంగా వీచిన గాలికి కూనవరం, చింతూరు రెండు మండలాల మధ్య సీతారాంపురం వద్ద రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎటపాక మండలంలోనూ రోడ్లపైనా, పంట పొలాల్లోనూ భారీ వడగళ్ల వాన కురిసింది. వడగళ్ల రాళ్లతో నిండిపోయి కాశ్మీర్ మంచును తలపించింది. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన వాన ఏడు గంటల వరకు ఏకధాటిగా కురవడంతో వాతావరణ ఒక్కసారిగా చల్లబడింది. గాలి వర్షానికి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కురిసిన అకాల వర్షానికి మామిడి పూత నేలరాలి పోయింది. ఈ సంవత్సరంలో వడగళ్లతో కూడిన వాన భారీ స్థాయిలో కురవడం ఇదే ప్రథమం.

గోడ కూలి ఉపాధ్యాయుడు మృతి

గాలి వానకు గోడ కూలి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర సుకుమా జిల్లా కుంట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జగన్ మృతి చెందాడు. చింతూరు మండలం చిడుమూరు పంచాయతీ పరిధి శుద్ధ గూడెం గ్రామంలో ఇటుక బట్టి ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం పెద్ద గాలి దుమారంతో వర్షం కురవడంతో ఇటుక బట్టి వద్ద ఏర్పాటు చేసిన షెడ్డులో జగన్ ఉన్నారు. ఈ క్రమంలో షెడ్డుకు ఉన్న ద్వారబంధంతో సహా గోడ కూలి ఆయన మీద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే గ్రామస్తులు కుటుంబీకులు చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి

ఉపాధ్యాయుడు జగన్ మృతదేహం

విషమించి ఉపాధ్యాయుడు మృతి చెందాడు. దీంతో కుంట గ్రామంలో విషాదఛాయలు అనుముకున్నాయి.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో గురువారం మధ్యాహ్నం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా, ఒక్కసారిగా వాతావరణం మారి మబ్బులతో కూడిన వాతావరణం ఏర్పడింది. అనంతరం ఉరుములతో కూడిన చిరుజల్లు సీలేరు పరిసరాల్లో కురిశాయి. ఆంధ్ర ఒడిశా సరిహద్దు చిత్రకొండ, గుంటవాడలో భారీగా వర్షం కురిసింది. నెల రోజులుగా ఉష్ణోగ్రతతో అల్లాడుతున్న ప్రజలు చిరుజల్లు కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు సేదతీరారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దుతో పాటు సీలేరు పరిసర ప్రాంతాల్లో మబ్బులతో కూడిన చల్లటి వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు.

పెదబయలు : మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు కుండ పోత వర్షం కురిసింది. ఉదయం విపరీతమైన. ఎండ కాసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపుల శబ్దాలతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

పొలంలో ఐస్ గడ్డలను తలపించేలా ఉన్న వడగళ్లు

అనంతగిరి : ఎండల ఉక్కపోతతో మండలవాసులు అల్లాడుతున్న తరుణంలో ఒక్కసారిగా కుండ పోత వాన కురవడంతో స్థానికులకు ఉపశమనం పొందారు. గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో వడగళ్ల వాన కురిసింది. వరి పంట వేసిన రైతులు పంట పొలాల్లో వర్షపు నీరు చేరడంతో ఆనందం వ్యక్తం చేశారు.

చట్టి- కూనవరం మధ్య సీతారాంపురం వద్ద రహదారిపై గాలివానకు కూలిన చింత చెట్టు.

సీలేరు కురుస్తున్న వర్షం

పట్టుబడ్డ గంజాయితో పోలీసు అధికారులు

రూ.3 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -సీలేరు

చింతపల్లి మండలం పెంటపాడు మీదుగా గంజాయి స్మగ్లర్లు అక్రమంగా తరలిస్తున్న రూ.3 కోట్లు విలువైన 1700 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు వివరాలను అడిషనల్ ఎఎస్‌పిలు తుహీన్ సిన్హా ప్రతాప్ శివ కిషోర్ చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా బోడపాదర్ పంచాయతీ జోడపుట్టు గ్రామంలో కిమిడు సీతారాం, మహారాష్ట్రకు చెందిన రవీంద్ర యాదవ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన షేక్ యాదవ్ గంజాయి కొనుగోలు చేసి బలిమెల నది పై నుంచి నాటు పడవల్లో చిత్రకొండ మారుమూల అటవీ ప్రాంతానికి చేర్చారు. ధారకొండ అటవీ ప్రాంతానికి కాలినడకన తీసుకొచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన వాహనంలో కింది భాగంలో గంజాయి బస్తాలు ఉంచి పైన బియ్యం బస్తాలు పేర్చి ఎవరికీ అనుమానం కలగకుండా ప్రణాళిక రూపొందించారు. ఆ సమాచారం పోలీసులకు అందడంతో పెంటపాడు వద్ద పట్టుకున్నారు. నిందితుల నుంచి గంజాయితో పాటు బైకు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాతో సంబంధం ఉన్న ఆరుగురు తప్పించుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గంజాయిని మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు వెల్లడించారు. సమావేశంలో చింతపల్లి సిఐ రమేష్, ఎస్‌ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2023-2024 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ కిషోర్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికిగానూ 6వ తరగతిలో 60 సీట్లు, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీలను నింపడానికి అర్హులైన విద్యార్థులు నుండి ఆన్లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి పరీక్షలు నిర్వహించి మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. మారేడుమిల్లి, వై.రామవరం, రాజవొమ్మంగి, రంపచోడవరం, అడ్డతీగల, చింతూరు తదితర ప్రాంతాల్లో ఉన్న ఏకలవ్య పాఠశాలలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసేవారికి 13 సంవత్సరాలు నిండి ఉండాలని, ఏడవ తరగతి వారికి 14 సంవత్సరాలు, 8వ తరగతి విద్యార్థులకు 12 నుండి 15 సంవత్సరాలు, 9వ తరగతి వారికి 13 సంవత్సరాల నుండి 16 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస, స్థల ధ్రువ పత్రం, రేషన్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధ్రువ పత్రం తదితర పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 30వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి 24లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లాలో ఖాళీగా ఉన్న 48 అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులనుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో 26, రంపచోడవరంలో 9, చింతూరు డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 13 అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి, చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు ఈనెల 17 నుంచి 24వ తేదీ సాయంత్రంలోగా సంబంధిత ఐసిడిఎస్ అధికారికి నేరుగా గానీ, పోస్ట్ ద్వారా గాని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అంగన్వాడీ కార్యకర్త, ఆయా, మినీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేయదలచిన స్థానికంగా నివాసముంటున్న వివాహిత మహిళలై ఉండి, తప్పనిసరిగా పదోతరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. 2023 జూలై 1 నాటికి 21ఏళ్ల పూర్తయి, 35ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. 21 ఏళ్ల దాటిన అభ్యర్థులు లభించని పక్షంలో 18ఏళ్ల నిండిన అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలిస్తారన్నారు. రిజర్వేషన్ ఆధారంగా ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించిన స్థానాలకే ఈ వయోపరిమిత సడలింపు వర్తిస్తుందన్నారు .

ఎంపికలో పదవ తరగతి ఉత్తీర్ణత 50 మార్కులు, ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ఐదు మార్కులు, వితంతువులకు ఐదు మార్కులు, మైనర్ పిల్లలు కలిగి ఉన్న వితంతువులకు ఐదు మార్కులు, పూర్తి అనాధ, క్రెచ్, హోమ్, ప్రభుత్వ సంస్థలలో నివసిస్తూ సత్ప్రవర్తన సర్టిఫికెట్ కలిగిన వారికి 10 మార్కులు, అర్హత కలిగిన వికలాంగ అభ్యర్థులకు ఐదు మార్కులు మౌఖిక పరీక్షకు 20 మార్కులు మొత్తం 100 మార్కులకు లెక్కిస్తారన్నారు. మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు జరుగుతాయని ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని, వారి అర్హతలను, మార్కులను పరిశీలించి ఎంపికలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

శిశు మరణాలు పునరావృతం కాకుండా చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో మాతశిశు మరణాలు తీవ్రం కాఉకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కె బాపన్నదొర ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీస్‌లు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో సచివాలయ, వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే విధి మండలం సీలేరులో పరీక్ష కేంద్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహణకు భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు. తొలిరోజున బుధవారం ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో పెట్లు ప్రవీణ్ అనే విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ వెబ్ కెమెరా ద్వారా చిక్కి డిబారైన నేపథ్యంలోఉన్నతాధికారులు సీలేరు ఇంటర్ పరీక్ష కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించిచారు. ఆర్.కామరాజును సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్ సాయిరాం, డిపార్ట్మెంట్ ఆఫీసర్ కెవి .రత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టి ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చర్యలు పటిష్టం చేశారు. స్థానిక ఎస్ఐ రామకృష్ణ పరీక్ష కేంద్రాన్ని వద్ద విస్తృత తనిఖీలు చేపట్టారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే డిబార్ కాక తప్పదని విద్యార్థులకు హెచ్చరించారు.

తెలుగు పరీక్షకు తొమ్మిది మంది గైర్హాజరు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ఎపి గురుకుల కళాశాల పరీక్షా కేంద్రంలో గురువారం జరిగిన ద్వితీయ ఇంటర్ తెలుగు పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరెంటెండెంట్ విజయరాం మోహనరావు వెల్లడించారు. 255 మంది విద్యార్థులు ఇంటర్ సెకెండియర్ తెలుగు పరీక్షలు రాయాల్సి ఉండగా, 246 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ కోర్సు పరీక్షకు పూర్తిస్థాయిలో పదిమంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. స్థానిక సిఐ బాజీలాల్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు గోపి నరేంద్రప్రసాద్, షరీఫ్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగింది.

టిడిపి నేతల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి -రంపచోడవరం : మండలంలోని బి.వెలమలకోట పంచాయతీ కేంద్రంలో ఇటీవల తెలుగుదేశం సీనియర్ నాయకులు జట్ల మూర్తి, జట్ల శ్రీను మాతృమూర్తి జట్ల భ్రమరాంబ మరణించడంతో గురువారం ఆయా కుటుంబాలను నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి, మాజీ ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు వంతల రాజేశ్వరి పరామర్శించారు. పెద్దకర్మకు హాజరైన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి ఆనందమోహన్, నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు కారం శేషయమ్మ, తెలుగు యువత అధ్యక్షులు సిద్ధ వెంకన్న దొర, యూనిట్ ఇన్చార్జి కుంజం బాపన్న దొర, యూనిట్ ఇన్చార్జ్ ప్రసాద్, సీతపల్లి గ్రామ కమిటీ ప్రెసిడెంట్ కొమరం రాము, పూల మండేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వి.ఆర్.పురం : రేఖపల్లి పంచాయతీ ఉమ్మడివరం రెడ్డిగూడెంలో రూ.ఏడు లక్షలతో కుంటతవ్వకం పూడికతీత ఉపాధి పనులను సర్పంచ్ పూనెం సరోజిని ప్రారంభించారు. పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అజరామరం

ప్రజాశక్తి- పాడేరు: పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చిత్రపటానికి కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం ఎఒ చిన్న బ్రిష్ట, ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్ ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్ ఎం.రాజు, పిఎయు ఇఇ కె.లావణ్య కుమార్, ఐటిడిఎ పరిపాలనాధికారి హేమ లత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో అమరజీవికి ఉపాధ్యాయుల నివాళి

రాజవొమ్మంగి : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు చిరస్మరణీయమని బోర్నగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఎస్ నాయుడు అన్నారు. బోర్నగూడెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర సాధనకోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవిగా నిలిచిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, బోడారావు కృష్ణ, ధర్మరాజు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - అడ్డతీగల అడ్డతీగల మండలం ఎల్లవరం పిహెచ్‌సి పరిధిలో డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. టిబీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వపరంగా ఉచితంగా అందిస్తున్న మందులను గురించి వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, ఆయాసం, కఫం పడటం, కఫంలో రక్తం ఉండడం, మెడ దగ్గర కణితలు, బరువు తగ్గడం, వంటి లక్షణాలుంటే వెంటనే సమీపంలోని ఆరోగ్యకేంద్రానికి వెళ్లి వ్యాధినిర్ధారణ పరీక్షలు జరుపుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ సత్యం బాబు, శాంతి, జి లక్ష్మి, టిబిఎస్ కల్యాణ్ రామ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లవరంలో టిబి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ఆగని శిశువుల మృత్యుఘోష!

బొర్రమామిడిలో నాలుగు నెలల పాప మృతి

కొద్దిరోజుల వ్యవధిలో ఇదే గ్రామంలో నలుగురు మృత్యువాత

చిన్నారుల మరణాలను అరికట్టడంలో వైఫల్యంపై ఆందోళన

మృత శిశువును చూస్తూ రోదిస్తున్న తల్లి విజయలక్ష్మి

ప్రజాశక్తి-హుకుంపేట : మన్యంలో శిశుమరణాలకు అడ్డుకట్ట లేకుండా పోతోంది. నిత్యం ఏదో ఒక గ్రామంలో ఎవరో ఒకరు ఏదో రూపాన మృత్యువాత పడుతుండడంతో ఆందోళన వ్యక్తమౌతోంది. శిశుమరణాలను అరికట్టేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చేస్తున్న ప్రకటనలు, తీసుకుంటున్న చర్యలను ప్రశ్నిస్తూ, శిశుమరణఘోష కొనసాగుతుం డడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా హుకుంపేట మండలంబి.బొడ్డపుట్టు పంచాయితీ బొర్ర మామిడి గ్రామానికి చెందిన చీకటి సోమన్న, విజయలక్ష్మి దంపతుల నాలుగు నెలల పాప గురువారం మృత్యువాత పడింది. ఉన్నట్టుండి పాలు తాగడం మానేసి, అదేపనిగా పాప ఏడుస్తుం డడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు 108 వాహనానికి సమాచారం అందించారు. అయితే 108 రాకపోవడంతో ప్రైవేట్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడింది. శిశుమరణాలు అగకుండా జరగడం, ఏ కారణాన వారు చనిపోతున్నారో తెలియని స్థితిలో బాధిత తల్లి దండ్రులతోపాటు మన్యవాసులు ఆందోళన చెందుతున్నారు బి.బొడ్డపుట్టు గ్రావ పంచాయతీ పరిధిలో గడచిన కొంతకాలంగా పదిమంది చిన్నారులు మరణిస్తే, ఒక్క బొర్ర మామిడి గ్రామంలోనే నలుగురు చిన్నారులు కొద్దికాలంలో మరణించారని గ్రామస్తులు అంటున్నారు. శిశు మరణాల అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మారుమూల గ్రామాల్లో ప్రబలిన విషజ్వరాలు

జలుబు, దగ్గు, జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు

వైద్యసేవలు అందక మంచాల్లోనే మగ్గుతూ అవస్థలు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ చిన్నకోనెల, బూరిగ గ్రామాలలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. సరైన వైద్యం అందక గిరిజనులు అల్లాడిపోతున్నారు. గత కొన్ని రోజులుగా ఇంటింటా దగ్గు, జలుబు, అధిక శరీర ఉష్ణోగ్రతతో జ్వరాలు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదని వాపోతున్నారు. సోమెల సన్యాసి, సోమెల వీరయ్య, జన్ని. కొత్తమ్మ, బూరిగ. చిన్న జోకులు, బూరిగ. గంగమ్మ, బూరిగ. మల్లమ్మ, బూరిగ. లచ్చమ్మ, బూరిగ పెంటయ్య, సోమెల సన్యాసితోపాటు చిన్న కోనల గ్రామంలో మరో ఎనిమిది మంది జ్వరాలతో బాధపడుతున్నారని ఆయా గ్రామస్తులు తెలిపారు. వారం రోజుల కిందట చిన్నపిల్లలకు వాంతులు విరోచనాలు కావడంతో విజయనగరం జిల్లా మెంటాడ ప్రభుత్వ ఆసుపత్రికి డోలి సహాయంతో వైద్యం నిమిత్తం తరలించగా, అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు మలేరియా, టైఫాయిడ్‌గా నిర్ధారించారని తెలిపారు. గ్రామంలో అనేకమంది అల్లాడుతున్నా పట్టించుకోకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వైద్యం శిబిరం నిర్వహించి వైద్యసేవలు అందించాలని, ఆయాగ్రామాల్లో జ్వరాలు తగ్గుముఖం పట్టేవరకు వైద్యశిబిరాలు నిర్వహించాలని కోరారు. దీనిపై అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒకు ఫోను ద్వారా సమాచారం అందించామని, వారి స్పందన కోసం చూస్తున్నామని గ్రామస్తులు సన్యాసి తదితరులు తెలిపారు.

జ్వరంతో బాధపడుతున్న కొత్తమ్మ

టేకు వనాల పెంపకంపై శిక్షణ

టేకు వనాల పెంపకంపై శిక్షణనిస్తున్న డిఎఫ్ఒ రాజు

ప్రజాశక్తి -సీలేరు : రాజమండ్రి ఫారెస్ట్ అకాడమీకి చెందిన 70 మందికి టేకు వనాలు పెంపకంపై జీకే వీధి మండలం సీలేరు అటవీ రేంజ్ 1పరిధి దుప్పిలివాడ పంచాయతీ, వలస గెడ్డ టేకు వనాల వద్ద గురువారం శిక్షణ ఇచ్చారు. ఇక్కడ 1969లోనూ, 1974లోనూ నాటిన టేకు వనాలను సందర్శించారు. ఈ సందర్భంగా చింతపల్లి సబ్ డివిజన్ డిఎఫ్ఓ ఎస్ఎస్‌బి.రాజు టేకు మొక్క దశ నుంచి చెట్లు ఏపుగా పెరిగే వరకు ఏ విధంగా పెంచాలి, ఎదుగుదలకు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టాలి అనే అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. సీలేరు అటవీ రేంజ్ ధారకొండ సెక్షన్ పరిధిలో 2022 సంవత్సరంలో పెంచిన మారుజాతి ప్లాంటేషన్, నర్సరీలో మొక్కలు పెరుగుదలకు ఏ విధంగా చర్యలు చేపట్టాలి అనే అంశాలపై వారికి తెలియజేశారు. అనంతరం చింతపల్లి అటవీ రేంజ్‌కు చేరుకొని అక్కడ ఉన్న కాఫీ తోటలు, మిరియాలు, యాలకులు, లవంగా, టేకు వనాలు మారుజాతి నర్సరీలు పెంపకంపై అకాడమీ బృందం అధ్యయనం చేసింది. పాడేరు అరుకు అటవీ రేంజ్ పరిధిలో పెంచిన వివిధ రకాల చెట్లు, అటవీ వనాలను పరిశీలించి అనంతరం వైజాగ్ చేరుకుంటారని సబ్ డిఎఫ్ఓ బిఎస్ఎన్ రాజు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరావు, ట్రైనీ రేంజ్ అధికారులు (చిట్టి తల్లి) కుమారి, వీరేంద్రబాబు స్థానిక అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సింహాచలం పడాల్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి : ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి అనంతగిరి:పాడేరు రోడ్డు కనెక్టివిటీ కింద మంజూరైన రహదారి పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పిఒ గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం మండలంలోని మారుమూల పైనంపాడు పంచాయతీ గ్రామాలలో సందర్శించి, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, గతంలో జరిగిన పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పైనంపాడు పంచాయతీ పరిధి ఎగువసొనభ నుండి కాకరపాడు వరకు పాడేరు కనెక్టివ్ రోడ్డు కింద రూ.కోటి గత ఏడాదిలోనే మంజూరైందని, పనులు ప్రారంభించని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు పరిశీలనకు తనతో పాటు రావాలని మండల పిఆర్ శాఖ అధికారులకు సమాచారం అందించినప్పటికీ హాజరు కాక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులు పండించిన కాఫీ, మిరియాల పంటలను దళారులను ఆశ్రయించి మోస పోవద్దని సూచించారు.

నిధులు మంజూరుకు వినతి

మండలంలోని పైనంపాడు పంచాయతీ గ్రామంలో పర్యటనకు వచ్చిన పాడేరు ఐటీడీఏ పీవోకు స్థానిక ఎంపీపీ శెట్టి .నీలవేణి గోపాలకృష్ణను కలిసి లిఖితపూర్వకంగా విన్నవించారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి, రహదారి సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. నూతన ఎంపీడీవో కార్యాలయానికి అవసరమైన ఫర్నిచర్ సదుపాయాలు కల్పించాలని ఆమె కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామి ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా, ఎంపీటీసీ తమన్న, జెఇ విజయ్, మాజీ వైస్ ఎంపిపి ఎస్.గుండన్న, మాజీ ఎంపీటీసీ గంగన్న, పాల్గొన్నారు.

గిరిజనుల పంటలను పరిశీలిస్తున్న పిఒ గోపాలకృష్ణ

హుకుంపేట:రోడ్డు నిర్మాణాలలో నాణ్యతలు పాటించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కించుమండ నుండి పైనంపాడు వరకు నిర్మించిన రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. అనంతరం హుకుంపేట జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సజీవుగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని సూచించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

అగ్ని ప్రమాద బాధితులకు సాయం ఇస్తున్న శివప్రసాద్

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని అంతాడ పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో ఇటీవలే జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులు రీమల శ్రీనివాస్, రాట్ల మంగ, రీమల ఎర్రయమ్మ కుటుంబాలకు అరకు ఎంపీ గొట్టేటి మాధవి సూచనల మేరకు 'నేను సైతం' ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 15వేలుఆర్థికసాయం అందించారు. ఈ ప్రమాదంలో సర్వం బూడిద కావడంతో నిరాశ్రయులై కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాలను నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ గురువారం పరామర్శించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు కుటుంబాలకు రూ. 15వేలు సాయం అందించారు. కాగా అగ్ని ప్రమాద బాధితులలో రాట్ల మంగ అనే గృహిణి ఎనిమిది నెలలు గర్భిణిగా ఉండడంతో ఆమెకు ప్రత్యేకంగా మానవతా దృక్పథంలో పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజ్ స్టాఫ్ మరో రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసింది.

గతంలో ఇదే పంచాయతీకి చెందిన ఏడు కుటుంబాలు అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోతే వారికి నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇళ్లు కట్టించి ఇచ్చినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజ్ కరస్పాండెంట్ రాజశేఖర్, నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ పంచాడా శ్రీరామమూర్తి, స్థానిక సర్పంచ్ రీమల చంద్రరావు., బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు నర్సి కిరణ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రీమల గంగాధర్ పాల్గొన్నారు.

గిరిజనులకు అందని ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి :గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుకు శేష కుమార్, పొడియం శ్రీనుబాబు ఆరోపించారు. ఇదేం కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం మండలంలోని వేటుకూరు పంచాయతీ పందిరి మామిడి కోట గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం అదోగతి పాలైందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో గిరిజనులకు కరెంటు బిల్లు ఉండేది కాదని, నేడు అధిక మొత్తంలో కరెంట్ బిల్లులు కట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇంటి పన్నులు అధికంగా పెంచారని తెలిపారు. చెత్త మీద పన్ను వేసిన చెత్త ప్రభుత్వం జగన్ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ సుభాన్, కర్రి సన్యాసిరెడ్డి, జిఎం వలస ఎంపీటీసీ కోరగాని సువర్ణ రాజు, పెతకంశెట్టి రాము, కారం మంగయ్య, పాము రాంబాబు, వేటుకూరు ఉప సర్పంచ్ కత్తుల కుమార్ వరప్రసాద్ రెడ్డి, రేవుల జానకి రెడ్డి, కత్తుల సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి వైఫల్యాలపై ప్రజలకు వివరిస్తున్న టిడిపి నేతలు

బియ్యం పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎండియు ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు :బియ్యం పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంచార పంపిణీ యూనిట్ (ఎండియు) ఆపరేటర్ గోవింద్‌పై చర్యలు తీసుకోవాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకే వీధి మండలం గాలికొండ, ఎ.ధారకొండ పంచాయతీల పరిధిలో తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని ఎండియు ఆపరేటర్ గోవింద్ సమగ్రంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలు, అంగన్వాడీ, మిడ్డేమీల్స్ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై జికె వీధి తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారుకు తెలియజేసినా వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఎంపీటీసీలు, సర్పంచులు అనేకసార్లు అధికారులకు ఫోన్ చేసి విన్నవించిన స్పందించకపోవడం దారుణమన్నారు. రెండు నెలలుగా ఎ.ధారకొండ పంచాయతీకి చెందిన తడకపల్లి, గొల్లపల్లి పాఠశాలలకు బియ్యం కూడా మంజూరు చేయలేదని, సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే ఎండియు ఆపరేటర్ గోవింద్ తంబ్ వేయకపోవడం వల్లే బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతుందని చెప్పారని బుజ్జిబాబు వెల్లడించారు. గోవింద్ తమ గ్రామాలకు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నాడని, ఆయన వలన తమకు ఎటువంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు విచారణ జరిపి ఆయన స్థానంలో వేరొకరిని నియమించాలని, రేషన్ లబ్ధిదారులకు, మిడ్ డే మీల్స్, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యాన్ని తక్షణమే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ కాకూరు బుజ్జిబాబు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

- గిరిజన సంఘం

ప్రజాశక్తి - రంపచోడవరం :మండలంలోని చిలకవీధి గ్రామం సిద్దుగూడెం వీధిలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షులు సాదల విద్యాసాగర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేసవికాలం కావడంతో బోరు శిథిలావస్థకు చేరుకుని నీరు కొద్దికొద్దిగా నీరు వస్తోందని, ముమ్మందు వేసవిలో నీటి ఎద్దడి తీవ్రత మరింత ఎక్కువయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బోరు ప్లాట్‌ఫాం కూడా పాడైనా పట్టించుకునే దిక్కు లేదన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు చేపట్టడం లేదనిగ్రామస్తులు చెపుతున్నారని, వెంటనే స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో బోదులూరి పోతురెడ్డి, కుర్ల రత్నారెడ్డి, కుర్ల శామ్యూల్‌రెడ్డి పాల్గొన్నారు.

శిథిలమైన బోరును పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత విద్యాసాగర్

సమయపాలన పాటించాలి : డిపిఒ

ప్రజాశక్తి -హుకుంపేట: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డిపిఒ టి.కొండలరావు సూచించారు. గురువారం హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కేంద్రమైన తీగలవలసలో అపరిశుభ్రత నెలకొనడంపై శానిటేషన్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టాలని, మరోమారు తాను పర్యటనకు వచ్చేసరికి ఇటువంటి పరిస్థితి కనిపించకుండా ఉండాలని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని,ముఖ్యంగా సమయపాలన పాటించాలని సూచించారు. అదేవిధంగా ఎస్‌డబ్ల్యుపిసి షెడ్డును సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వంతల పరశురాం, కార్యదర్శి ఆర్.సాగర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రశ్నిస్తున్న డిపిఒ కొండలరావు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -రంపచోడవరం : రంపచోడవరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అల్యూమినియం అసోసియేషన్, పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు రిటైర్డ్ టీచర్ మోపిదేవి వెంకటరామమ్మ ఇచ్చిన రూ.25 వేల విరాళంతో కళాశాలలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను కళాశాలకు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం భన్సల్ ప్రారంభించారు. అదే విధంగా కళాశాల విద్యార్థులు శ్రమదానంతో ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్‌ను కూడా సబ్‌కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్యూమినియం అసోసియేషన్ నూతన కమిటీని ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్నారు.

అసోసియేషన్ అధ్యక్షునిగా వీరభద్రరావు, ఉపాధ్యక్షునిగా కిరణ్, లేడీస్ సెక్రటరీగా అపర్ణ, జనరల్ సెక్రటరీగా చక్రపాణి, ట్రెజరర్‌గా బ్రహ్మ, జాయింట్ సెక్రెటరీ పల్లాల దుర్గాప్రసాద్‌లను ఎన్నుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ పర్యవేక్షణలో జేజిబాబు సహకారంతో నిర్వహించిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అసోసియేషన్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత స్టవ్‌లపై అవగాహన

ప్రజాశక్తి -చింతూరు : మండలంలోని చట్టి కుమ్మురు గ్రామపంచాయతీలో క్రాప్ జోన్ సంస్థ ఆధ్వర్యంలో కాలుష్య రహిత స్టవ్‌ల వినియోగంపై క్రాప్ జాస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది మట్టి పొయ్యిలను ఉపయోగించి, హానికరమైన రీతిలో వంట చేయడం వల్ల ఇళ్లలోపల పొగతో కూడిన కాలుష్యాన్ని కలిగించడంతోపాటు దీనిబారిన పడి వంటచేసే మహిళలు యు ఊపిరితిత్తుల కేన్సర్‌తోసహా అనేక వ్యాధులకు గురౌతున్న పరిస్థితుల్లో క్రాప్ జోన్ సంస్థ పొయ్యిల వల్ల ప్రయోజనకరంగా ఉంటుందని వివరిస్తూ అవగాహన కల్పించారు. కుమ్మురు సర్పంచ్ నాగార్జున, సర్పంచ్ భద్రమ్మ. సెక్రటరీ రఘుబాబు, వాలంటీర్లు రమేష్, అంజి, క్రాప్ జోన్ సంస్థ పోద్దయ్య పాల్గొన్నారు.

'స్వచ్ఛ సంకల్పం' రిక్షా ప్రారంభం

ప్రజాశక్తి - పెదబయలు రూరల్ :మండలంలోని పర్రెడ గ్రామ సచివాలయంలో సర్పంచ్ చెండా రవిశంకర్ గురువారం స్వచ్ఛసంకల్పం రిక్షాను క్లాస్ మిత్రల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలు వినియోగించిన చెత్తా చెదరం తడి పొడిగా వేరువేరుగా చేయాలన్నారు. సచివాలయ సెక్రటరీ అంబిడి లలితాకుమారి, డిజిటల్ అసిస్టెంట్ మత్స్యరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మనాభం, వార్డ్ మెంబెర్ పి.రవికుమార్, వాలంటీర్స్ ప్రవీణ్ కుమార్, ఎం.కృష్ణారావు, క్లాస్ మిత్ర లక్ష్మి, కళ్యాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొట్లాటలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- రంపచోడవరం : మారేడుమిల్లి రోడ్డు వద్ద చికెన్ షాప్ వద్ద జరిగిన గొడవ, కొట్లాటలో వ్యక్తి రహీమ్ అనే వ్యక్తి తలపై తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనంలో రంపచోడవరం ప్రభుత్వ అసుప్రతికి తరలించారు. అధికంగా రక్తస్రావం కావడంతో ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉండడంతో బాధితుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన రహీం